# ఎంసెట్ విద్యార్థుల కోసం వెబ్‌సైట్

## రూపొందించిన ఇంజినీరింగ్ విద్యార్థి

## పోటీ పరీక్షలు రాసే వారి కోసం మరోటి



వెబ్‌సైట్‌ను రూపొందించిన బీటెక్ విద్యార్థి యుగంధర్

**ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చినా మంచి కాలేజీలో సీటు వస్తుందో లేదో అనే అనుమానం మీకుందా... మీకు నచ్చిన కళాశాలలో సీటు వస్తుందో లేదో తెలుసుకోవాలని ఉందా... సీటు కోసం వంద కళాశాలల పేర్లు సూచించకుండా.. తక్కువ కాలేజీలను ఎంపిక చేసుకోవాలని ఉందా... అయితే మాక్ కౌన్సెలింగ్‌లో పాల్గొనండి... అదెలాగ అంటారా...**

www.apemcet2010.com వెబ్‌సైట్ లాగిన్ అవ్వండి అంటున్నారు బీటెక్ విద్యార్థి యుగంధర్. గత ఏడాది ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా ఈ ఏడాది ర్యాంకులకు ఏ కళాశాలలో... ఏ బ్రాంచిలో సీటు వస్తుందో ఇంట్లోనే ఉండి తెలుసుకోవచ్చు అంటున్నారు. అయితే ఇది వంద శాతం కచ్చితం కాకపోయినా... తొంభై శాతం కచ్చితత్వాన్ని సూచిస్తుంది అంటున్నారు ఈ విద్యార్థి. తాను గతంలో ఇంజినీరింగ్ సీటు కోసం వెబ్ కౌన్సెలింగ్‌కు వెళ్లి... మంచి ర్యాంకు వచ్చినా కూడా తనకు నచ్చిన కళాశాలలో వస్తుందో లేదో అనే అనుమానంతో లిస్టులో ఉన్న కళాశాలలన్నింటినీ గుర్తించాల్సి వచ్చిందన్నారు. తన తోటి స్నేహితుడు నిఖిలేష్ ఏడు వేలు ర్యాంకు వచ్చినా... తనకు సీటు రాదేమోనని... వచ్చినా కూడా మంచి కళాశాలలో సీటు రాదేమోననే అనుమానంతో సీఏ చదవడానికి నిర్ణయించుకున్నాడని తెలిపారు. దీంతో అతడు ఇంజినీరింగ్ చదివే ఛాన్స్ కోల్పోయాడన్నారు. ఇలాంటి విద్యార్థులు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారని...వారికి ముందుగా అవగాహన కల్పించడం కోసం ఈ వెబ్‌సైట్‌ని ప్రత్యేకంగా తయారు చేశానంటున్నారు యుగంధర్.

**ఇతర వెబ్‌సైట్లకు భిన్నం..**

వెబ్‌కౌన్సెలింగ్ విధానం ద్వారా సీటు వస్తుందా రాదా అనే విషయాన్ని కొన్ని వెబ్‌సైట్ల నిర్వాహకులు ర్యాంకు ఆధారంగా అవగాహన కల్పిస్తున్నా... వాటికంటే మరింత సమాచారంతో విద్యార్థుల ర్యాంకు ఆధారంగా ఫలానా కాలేజీలో సీటు వస్తుంది అనే దానిని తన వెబ్‌సైట్ సూచిస్తుంది అంటున్నారు. తన వెబ్‌సైట్‌లో గర్ల్స్, బాయ్స్, కులము, అందులో రిజర్వేషన్ శాతం, వికలాంగులకు, ఎన్‌సీసీ విద్యార్థులకు, స్పోర్ట్స్ కోటా తదితర వివరాలను ఆధారంగా సీటు కేటాయింపు వివరాలు వస్తాయన్నారు. మిగతా వెబ్‌సైట్లు కేవలం ర్యాంకు ఆధారంగా మాత్రమే సీటు ఏ కళాశాలలో వస్తుందనేది తెలియజేస్తారన్నారు. అంతేకాకుండా విద్యార్థి ర్యాంకు అనాలసిస్ కూడా ఇందులో ఉంటుందన్నారు. వచ్చిన ర్యాంకు స్టేట్, రీజియన్, క్యాటగిరి, రీజినల్ అండ్ క్యాటగిరీ, రీజినల్, క్యాటగిరీ అండ్ జెండర్ ఆధారంగా ర్యాంకు అనాలసిస్ జరుగుతుందన్నారు. ఇందులో 40 బ్రాంచిలు, మూడు లోకల్ యూనివర్శిటీలు, ఒక నాన్‌లోకల్ యూనివర్శిటీ పరిధిలోని కాలేజీ వివరాలను తెలుసుకోవచ్చని వివరించారు.

యుగంధర్ 8వ తరగతి చదువుతుండగానే ఓ ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్‌ని రూపొందించారు. www.andhrafunda.com అనే ఈ వెబ్‌సైట్‌కి మంచి స్పందన వచ్చిందన్నారు. ఇప్పుడు ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఏపీఎంసెట్ 2010 పేరుతో రెండో వెబ్‌సైట్‌ని రూపొందించానన్నారు. త్వరలో పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకోసం మరో వెబ్‌సైట్‌ని కూడా రూపొందిస్తాన్నారు. ఇందులో పాత ప్రశ్నాపత్రాలు, విజేతల వివరాలు పొందుపరుస్తానని తెలిపారు. www.indistudent.com పేరుతో ఈ వెబ్‌సైట్‌ని రూపొందించనున్నట్లు తెలిపారు.

**- సిటీలైఫ్ ప్రతినిధి**